# అన్నమయ్య అపూర్వ కీర్తనలు



శాంతా వసంతా ట్రస్ట్
హైదరాబాదు

సంగీతం

డా॥ వి.బి.సాయికృష్ణ యాచేంద్ర

ఛైర్మన్ - శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్

# అన్నమయ్య అపూర్వ కీర్తనలు

## సంగీతం : సాయికృష్ణ యాచేంద్ర

| కీర్తన | గానం | రాగం |
| --- | --- | --- |
| 1. ఎంత నన్ను | హరిణి | పహాడి |
| 2. వరుసవంతుకు వచ్చీనీ | లోకేష్ | హిందోళం |
| 3. ఈడనె చుట్టరికము | గోపిక పూర్ణిమ | దేశ్ |
| 4. నీకే చెల్లు | పవన్ | హంసానాదం |
| 5. కటకటా నీవల్ల కాలమెల్ల | హరిణి | మోహన |
| 6. ఎన్నిదినంబుల కాచుక | శ్రీనిధి | వాగధీశ్వరి |
| 7. ఒత్తి మేము జెప్పబోతే | హరిణి | ఉదయ రవిచంద్రిక |
| 8. వలపె గండమాయ | లోకేష్ | శంకరాభరణం |
| 9. ఎరగడనగా వచ్చునా | హరిణి | శుద్ధసావేరి |
| 10. ఇద్దరికి తగునయ్య | గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్ | వాచస్పతి |
| 11. నీ పాపము నీవేమి సేతువు | హరిణి | అభేరి |

# 1. ఎంత నన్ను వేడుకొనేవిదేమయ్య

గానం : హరిణి　　　　　　రాగం : పహాడి

పల్లవి : ఎంత నన్ను వేడుకొనే - విదే మయ్య
కంతుడ వీవనిన మాట - కాదనేమా మేము
॥ ఎంత ॥

చరణం: చెలగి నీతో కాపురము - చేసేటందు కాపె గాగా
నిలువు కొలువులకు - నేమా నీకు
చలము బలిమిని మోవి - చవు లాపె గొనగాను
మలసెడి సరసములకు - మరి నేమా నీకు
॥ ఎంత ॥

చరణం: సొక్కుచు ఆపె నీతో - జూదము లాడగా
నిక్కుచు నెత్తులు చెప్ప - నేమా నీకు
పక్కనుండి ఆపె నీతో - పలుమారు బెనగగా
నెక్కొన్న చనవులకు - నేమా నీకు
॥ ఎంత ॥

చరణం: పచ్చిగా నినుగూడ - పగటికి ఆపె గాగా
నిచ్చరాతిరి వేగించ - నేమా నీకు
అచ్చుట శ్రీవేంకటేశ! - ఆపె నెట్లా గూడితివో
యిచ్చ యెరిగి భోగింప - నేమా నీకు ॥ ఎంత ॥

# 2. వరుసవంతుకు వచ్చీనీ

గానం : లోకేష్ రాగం : హిందోళం

పల్లవి : వరుసవంతుకు - వచ్చీనీ, యీాపె
గరిమె నిన్ను వెల- గా గైకొన్నదే తాను ॥ వరుస ॥

చరణం: తరుణి నిన్నేటికి - తరువులబెట్టీని
మరుడు అంపిన - ముద్రమానిసే తాను
సరసాలు నీకేల - సారె నేర్పవచ్చీని
అరుదైన వలపులకు - అయ్యవారా తాను ॥ వరుస ॥

చరణం: కలికి నీకేటి (కి?) క - తలు చెప్పవచ్చీని
యిల తమి నుపదేశ - మిచ్చీనె తాను
వలపు చూపుల బొ - మ్మల జంకించీని
యిలలో ఈ విద్యలకు - యేలికా తాను ॥ వరుస ॥

చరణం: శ్రీవేంకటనాథ నిన్ను - చేరి కౌగిలించీని
ఆవటమైన - నావంటి యిల్లాలా తాను
వోవరి లోపల నీ - వురము పైకెక్కీని
కావరాన జలరాశి - కన్యకా తాను ॥ వరుస ॥

## 3. ఈడనె చుట్టరికము

గానం : గోపిక పూర్ణిమ                    రాగం : హంసానాదం

పల్లవి : ఈడనె చుట్టరికము - లేలా సేసేవూ
వేడుక గావలసితే యింత - వేగిర మేల నయ్యా
॥ ఈడనె ॥

చరణం: కన్నుల చూపులు నాటి - కక్కసించి రాకువయ్య
పన్నిన కంకణా లొత్తి - పట్టకువయ్యా
చన్నుమొనలు నాటీని - సారె పెనగుకువయ్య
యిన్నిటా నీ కితవైతే మా - యింటికి రావయ్య
॥ ఈడనె ॥

చరణం: ముక్కునిట్టూర్పులు బారీ - మోవితేనె లానకువయ్య
సొక్కుబట్టీ మేనుమేను - సోకకువయ్యా
వుక్కుగోరు జీరబారీ - వొరసి నవ్వకువయ్య
మక్కువ గావలసితే - మాటుకు రావయ్య
॥ ఈడనె ॥

చరణం: చేతమ్ముల ముమ్మాటికి - చెక్కిలిగొట్టకువయ్య
కాతరికళలంటి యా - కారకువయ్య
యీతరి శ్రీవెంకటేశ - యిట్టె నన్ను గూడితివి
కాతరీడవైతే నా - కౌగిటికి రావయ్య
॥ ఈడనె ॥

# 4. నీకే చెల్లు నాపెకే

గానం : పవన్ రాగం : హంసానాదం

పల్లవి : నీకే చెల్లు నాపెకే - నిక్కముగా జెల్లు
ఏకాంతైనా పతి - నింతగా చేసినదా ॥ నీకే ॥

చరణం: అత్తువో పందె మోడితివో - అమ్ముడుబోతివో
మొత్తమి జీత మందితివో - మోచే వాపెను
అత్తి వెల యిచ్చెనో - అరణాన దెచ్చెనో
యిత్తరి యెదనెక్కుట - యిల్లాలికి దగునా ॥ నీకే ॥

చరణం: గురువో నీ దేవరో - కోరి నుడిగే మంత్రమో
బెరసే యేలికో ఆపె - పేర గైకొంటివి
హరి నిన్ను రక్షించెనో - ఆస నిన్ను గడించెనో
ధరలోన నీ మేనెల్ల - తన ముద్ర వేసునా ॥ నీకే ॥

చరణం: వలపడితో దక్కితో - వారక మందితివో
తలకొన్న జిగురువో - తగిలితివో
పొలపొ అలమేల్మంగ - బూని శ్రీవేంకటనాథ
ఇల (నీ) పంపుగొనే యీకె ని - న్నింత చేసునా
॥ నీకే ॥

# 5. కటకటా నీవల్ల కాలమెల్ల

గానం : హరిణి                                        రాగం : మోహన

పల్లవి : కటకటా నీవల్ల - కాలమెల్ల నీతీరాయ
యెటువలె నా కోర్కె - లీడేర్చు టెరుగ
॥ కటకటా ॥

చరణం: అలుకే మానుపబట్టె - అయ్యయో నే వేగినంత
కలసి వేడుక నుండ - గా లేదుగా
పిలిచి సారెకు నేనె - ప్రియము చెప్పగాబట్టె
కలనైనా నీవు నన్ను - గారవించు టెరుగ
॥ కటకటా ॥

చరణం: అరమరదీర్చబట్టె - అయ్యయో నే వేగినంత
గరకరికతోనుండ - గా లేదుగా
నిరతము బుజ్జగించి - నేనె వేడగా బట్టె
అరుదుగ నీవు నన్ను - ఆదరించు టెరుగ
॥ కటకటా ॥

చరణం: అదను దెలుపబట్టె - అయ్యో నే వేగినంత
కదసి వేడుకనుండ - గా లేదుగా
యిదిగో శ్రీవెంకటేశ - యేనె పైకొనబట్టె
మది నా కొసగి నెమ్మ - దినుండ లేదుగా
॥ కటకటా ॥

## 6. ఎన్నిదినంబుల కాచుక

గానం : శ్రీనిధి　　　　　　　　　　రాగం : వాగధీశ్వరి

పల్లవి : ఎన్నిదినంబులు కాచుక వుండెనో – ఇటువలె సేసెద ననుచు
కన్నుల పండుగ గావించినది – కామరూప గాబోలురా
॥ ఎన్ని ॥

చరణం: పెదవేల పొక్కెరాయంటే – పెంపుడు ముద్దులచిలుక
కొదలేని చక్కరతమిచే – గొరికే నంటివి బాపురా
యెదలోపలనె తడబడక నిన్నింత – (కొదలేక) జేసినది
అది నా మదిలోయెంచి చూచితె – ఆడుచిలుక కాబోలురా
॥ ఎన్ని ॥

చరణం: మెడ యాల జీరెరాయంటె – మించుల గేఁదఁగిరేకు
చిడిముడి వలపుల వాసన – జీరెనంటివి బాపురా
అడయాళముగా నిన్ను – అందరిలోనంత గురుతుగా జేసినది
కడలేని కతకారితనమున – కన్నెగేదగిరేకు గాబోలురా
॥ ఎన్ని ॥

చరణం: మేనేల యలసెరా యంటే – మిక్కిలి చక్కనిబొమ్మ
నా నేర్పుతో నాడించగా అలసె – నంటివి బాపురా
వేనలి జారంగ నిపుడు శ్రీ – వేంకటనాథ యేలితివి
ప్రాణముగల యిల్లా లది – పైడిబొమ్మ గాబోలురా
॥ ఎన్ని ॥

# 7. ఒత్తి మేము జెప్పబోతే

గానం : హరిణి　　　　　　రాగం : ఉదయ రవిచంద్రిక

పల్లవి : ఒత్తి మేము జెప్పబోతే - వొకటిపై వొకటౌను, వాని
చిత్తము రంజిల్ల సేవ - సేయవె గొబ్బునను

|| ఒత్తి ||

చరణం: చేరెడు పంచదార - (చేర్చినా) పాలు చప్పనంటా
ఆరగించడు మో - వానవమ్మా
సారెకు మొక్కి మొక్కి (వే - సారితిమీ యలుక)
తీరదు నీచేతగాని - దిద్దవె గొబ్బునను

|| ఒత్తి ||

చరణం: పట్టెడు జవ్వాది బుయ్య - బాతిగా దంటా, విరులు
ముట్టడు, నీ తురుమున - మోపవమ్మా
గుట్టుతో వాని పాదాలు - బట్టుక అలసితి మింక
రట్టడి సమ్మతిగాను - రాసేయవె గొబ్బునను

|| ఒత్తి ||

చరణం: యిచ్చవచ్చిన తామెర - లెన్నిబరచిన సెజ్జ
మెచ్చడు, నీ పదమున - మెట్టవమ్మ
గుచ్చి అలమేల్మంగ - గూడి శ్రీవేంకటేశుని
హెచ్చుగ నురము మీద - నెక్కవె గొబ్బునను

|| ఒత్తి ||

## 8. వలపె గండమాయ

గానం : లోకేష్ రాగం : శంకరాభరణం

పల్లవి : వలపె గండమాయ నీ - వనితకు
తలచవు దోసము - తగిలీ సుమ్మీ

॥ వలపె ॥

చరణం: కొండలపై పెనువాన - గురిసినరీతి, చను
గొండల కన్నీటివాన - గురియగాను
వుండుండీ పాన్పు మీద - వొరగి కన్నుమూసిన
గుండె ఝల్లుమని ఆడు - కోలు దాకీ సుమ్మీ

॥ వలపె ॥

చరణం: తీగె దావాగ్నిచే - తెరలినగతి, మేను
తీగె విరహాగ్నిచే - తెరలగాను
వేగలేక ప్రాణములు - విడుచునో యింతకు
ఆగినపాపము ని - న్నంటీ సుమ్మీ

॥ వలపె ॥

చరణం: కాగిన బంగారుకమ్మి - కాక నీట నారులీల
కాగిన చెలి మేను వెం - కటవిభు (గూడగాను)
వేగిన రతిచెమటల - (వేడి) చల్ల జేసితివి
కౌగిట నుంచిన కీరితి - గలిగీ సుమ్మీ

॥ వలపె ॥

# 9. ఎరగడనగా వచ్చునా

గానం : హరిణి　　　　　రాగం : శుద్ధసావేరి

పల్లవి : ఎరగడనగా వచ్చునా - యిదిగో వీడు, తన
శిరసు వంచుక నుండగా - చెక్కునొక్కీ నిదిగో వీడు
॥ ఎరగ ॥

చరణం: నూటికి మొక్కిన మొక్కులు - నొసలపై నుండగ(?)
నేటికి వొడబరచె - నిదిగో వీడు
కాటుకకన్నుల నీరు - కడలనే వుండగా
నాటకపుబత్తితో - నవ్వించీ నిదిగో వీడు ॥ ఎరగ ॥

చరణం: పట్టిన యానలు తన - పాదాలపై నుండగా
యిట్టే పైపై తమకించీ - నిదిగో వీడు
వట్టికోపపు చెమట వ - (డియుచు) నుండగా
గట్టిగా మర్మము లొత్తి - కరగించీ నిదిగో వీడు ॥ ఎరగ ॥

చరణం: కుమ్మరించే సిగ్గులు - కుచములపై నుండగా
యెమ్మెలతో కౌగిలించీ - నిదిగో వీడు
అమ్మరో శ్రీవేంకటప్ప - డలమేల్మంగను
సమ్మతితోను గూడి - చనవిచ్చీ నిదిగో వీడు ॥ ఎరగ ॥

# 10. ఇద్దరికి తగునయ్య

గానం : గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్ రాగం : వాచస్పతి

పల్లవి : ఇద్దరికి తగునయ్య – యిటువంటి పొందులు
వొద్దిక చూచిన సతులు – వుబ్బుచు నలిగిరి
॥ ఇద్దరికి ॥

చరణం: కాంత నీ భుజముమీద – గడ్డము మోవగాను
చెంతనే చెక్కుతో చెక్కు – జేర్చుకొని
వింతగ కుచములు – వీపున నానించుకొని
యెంత నిన్ను కరగించె – నెటువంటి వేడుకో
॥ ఇద్దరికి ॥

చరణం: కరముల నిన్ను గుచ్చి – కౌగిలించి పట్టుకొని
సొరిది నీ మయి గోరుల – సోకించుకొని
తొరల నీ తొడలపై – తొడలు వేసుకొని
కరగించె నిన్నెంత యే – కలికియోకాని
॥ ఇద్దరికి॥

చరణం: వీనుల రహస్యములు – విన్నపములు సేసుకొని
ఆనించి నీ మోవితేనె – లట్టే గైకొని
నానా రతులగూడి – నవ్వించె శ్రీవేంకటేశు
ఈ నాతి నేర్పులు – యిక నెన్నిగలవో
॥ ఇద్దరికి ॥

## 11. నీ పాపము నీవేమి సేతువు

గానం : హరిణి    రాగం : అభేరి

పల్లవి : నీ పాపము నీవేమి సేతువు - నే జేసినట్టి నా పుణ్యమింతె
దాపుగా నిను జూడు మనంటివా - తగులుపడు మంటివా
|| నీ ||

చరణం: యిరవుగా మోహించుమంటివా
- యీ విరహాగ్ని పుట్టుమనంటివా
పరితాపము లెమ్మనంటివా - పొరలాడుమంటివా
తరుచై దాహము గమ్మంటివా - తబ్బిబ్బులాడమనంటివా
శిరసు నొవ్వి పట్టుమనంటివా - చింతతో నుండుమంటివా
|| నీ ||

చరణం: అన్నము నన్ను విడుమంటివా
- అన్ని రుచులు మానుమంటివా
వన్నెలు బెట్టకు మనంటివా - వగల వేగుమనంటివా
వున్నమాట లొల్లకుమనంటివా
- వొడలు చాలా చిక్కుమనంటివా
కన్నుల నీరు నించుమనంటివా
- కన్నవారి విడువుమనంటివా
|| నీ ||

చరణం: చెప్పి చెలిని బంపు మనంటివో

– సిగ్గులు విడు మనంటివో

తప్పక యింటికి రమ్మంటివో – తమకించుమంటివో

వొప్పులాడి అలమేలుమంగ – వొడయ శ్రీవేంకటేశ

అప్పుడె నన్ను కలయుమంటివో

– అట్టె పాయక వుండుమనంటివో

॥ నీ ॥

‘అన్నమయ్య అపూర్వ కీర్తనలు’ ఆడియో
మీ మొబైల్‌లో వినాలంటే ఈ QR Code
స్కాన్ చేసి వినండి.

‘అన్నమయ్య అపూర్వ కీర్తనలు’
యూట్యూబ్ వీడియో ఈ QR Code
స్కాన్ చేసి చూసి ఆస్వాదించగలరు.

- ☛ Open the Scan App in your Android Phone
  QR Scan App in Iphone
- ☛ Scan this QR Code
- ☛ Download the Songs in your Smart Phone

OR

Also you can watch in youtube.

Our channel name is :

Shanthavasanthatrust